దర్శనమిచ్చిన నెలవంక

ప్రారంభమైన రంజాన్ మాసం

పారిశుధ్యంపై సూచనలిస్తున్న కుప్పం మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి -కుప్పం టౌన్ : ఆకాశంలో నెలవంక దర్శనం ఇవ్వడంతో రంజాన్ మాసం ఆరంభ మైందని ముస్లిం మత పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా కుప్పం పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ పరిధిలో ఉన్న మసీదులలో రేపటి నుండి ప్రత్యేకంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తామని, ఎక్కడా నీటి, పారిశుధ్య సమస్య రాకుండా చూసుకోవాలని పురపాలక సంఘం సిబ్బందికి సూచించారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు చేపట్టే దీక్ష విజయవంతంగా పూర్తి కావాలని కోరుకుంటున్నానని , ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

జీడీనెల్లూరును 'కంచుకోట'గా మారుస్తా

'సామాజిక పింఛన్ల' పంపిణీలో చంద్రబాబు

నేను రుణపడేది టిడిపికార్యకర్తలకే...

2వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

స్టాల్స్ పరిశీలిస్తున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం, జీడీనెల్లూరు

'కార్యకర్తలు శ్రమించడంతో జీడీనెల్లూరులో టిడిపి జెండా 30 ఏళ్ల తరువాత ఎగిరింది.. ఇక కంచుకోటగా మారుస్తా.. కార్యకర్తలను చూస్తే నాకు కొండంత ధైర్యం.. ఎనిమిది నెలలుగా పాలనలో బిజీగా ఉండడంతో మిమ్మల్ని కలవలేకపోయాను.. ఇకపై ఏ కార్యక్రమానికి వెళ్లినా కార్యకర్తలతో ఖచ్చితంగా మాట్లాడతాను..' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. 'సామాజిక పింఛన్ల' పంపిణీలో భాగంగా గంగాధరనెల్లూరుకు విచ్చేసిన ఆయన పింఛన్ల పంపిణీ, పేదల సేవలో కార్యక్రమం అనంతరం కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఎన్ని పనులున్నా వెళ్లిన ప్రతిచోటా కార్యకర్తలను కలవడం బాధ్యతగా పెట్టుకుంటానన్నారు. వైసిపికి ఉపకారం చేస్తే పాముకు పాలు పోసినట్లేననే విషయాన్ని నేతలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఐదేళ్లపాటు ప్రజలు, కార్యకర్తలు నరకం చూశారని, శనివారం వస్తే ఎక్కడ ప్రొక్లెయిన్ వస్తుందో, ఏ నాయకుని అరెస్టు చేస్తారో తెలియదన్నారు. తాను రుణపడి ఉండేది పార్టీ కార్యకర్తలకేనన్నారు. ఇకపై తనకు, కార్యకర్తలకు మధ్య దూరం ఉండదన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంఎల్ఎ, ఎంపిల గురించి కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకుంటానన్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలన్నారు. తన దృష్టిలో మాటలు చెప్పేవారు కాదని, ఓట్లు సంపాదించేవారే అసలైన విజేతలన్నారు. తనను పొగిడితే వచ్చేదేమీ లేదని, మంచి పనులు చేస్తే మళ్లీ మన ప్రభుత్వం వస్తుందన్నారు. కార్యకర్తలకు గౌరవం ఇవ్వడమే కాదని, అవసరమైతే కొరఢా తీసుకుంటానన్నారు. మారకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. ఎంఎల్ఎ విఎం థామస్ మాట్లాడుతూ విజనరీ నాయకుడు చంద్రబాబు అన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ పింఛన్ అందిస్తున్నారని, సెలవు ఉన్న రోజులైతే ఒకరోజు ముందే ఇస్తున్నా రన్నారు. నియోజకవర్గంలో పేదలు, చదువుకున్న నిరుద్యోగులు ఉన్నారని, మామిడి, చెరకు సాగుపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. తచ్చూరు హైవే సమీపంలో ఉండటం వల్ల పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉందని, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలన్నారు. గంగాధరనెల్లూరులో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని కోరారు. వెదురుకుప్పం, పాలసముద్రం, కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో ఆస్పత్రి భవనాలను పూర్తి చేయాలన్నారు. మామిడి బోర్డు ఏర్పాటు చేసి మామిడి రైతులను ఆదుకోవాలన్నారు. కృష్ణాపురం, ఎన్టీఆర్ జలాశయాలను అనుసంధానం చేసి తాగునీరు, సాగునీరు అందించాలని సిఎంకు విన్నవించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజన్ ప్లాన్‌తో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తామన్నారు.

నియోజకవర్గానికి సిఎం వరాలజల్లు

- నియోజకవర్గంలో రెండువేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తాం.
- బాలుర గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తాం.
- పెనుమూరు మండలం కల్వకుంట దగ్గర ఎన్టీఆర్ జలాశం నుంచి కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం జలాశయం వరకూ అనుసంధానం చేసి సమీపంలోనిచెరువులకు నీళ్లు నింపే ప్రయత్నం చేస్తాను.

'ప్రజావేదిక'లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖచే ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. రూ.30.50 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ ద్వారా ముఖ్యమంత్రి ఫోటోను సిద్ధం చేసిన జీడీనెల్లూరు మండలం మారేడుపల్లికి చెందిన అమృతను సిఎం అభినందించారు. సంక్షేమ శాఖ ద్వారా 20 మంది వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు రూ.1.45 లక్షలతో రెండు స్కూటర్లు పంపిణీ చేశారు. 704 మంది లబ్ధిదారులకు బిందు తుంపర్ల సేద్యం పరికరాలను అందజేశారు. ఎంఎల్ఎ నిధులతో ఎనిమిది ఆటోలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ సీఎంకు స్వామి వారి ప్రసాదాలు

చిత్తూరు జిల్లా జి డి నెల్లూరు పర్యటన నిమిత్తం రేణిగుంట ఎయిర్‌పోర్ట్ కు విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడుఀు సాదర స్వాగతం పలుకుతూ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రసాదాలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అందించారు. శ్రీకాళహస్తి జనసేన, బిజెపి ఇన్‌ఛార్జిలు వినూత కోట, కోలా ఆనంద్ ఉన్నారు.

రక్షిత, హేమశ్రీ బాధ్యత 'కూటమి'దే..

బీసీ కాలనీలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు లేని బాలికలు రక్షిత (10), హేమశ్రీ (8) ఐదు, మూడో తరగతి గంగాధరనెల్లూరు హైస్కూల్లో చదువుతున్నారు. కార్యకర్తల ద్వారా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఈ బాలికల సమాచారాన్ని చేరవేశారు. సిఎం దృష్టికి తీసుకెళ్లగా రక్షిత, హేమశ్రీ బాధ్యత కూటమి ప్రభుత్వమే భరిస్తుందన్నారు. పెన్షన్ లబ్ధిదారుని భార్య సెల్వీ మాట్లాడుతూ తన మనవరాళ్లను చదివించాలని, తమకు సొంత ఇల్లు లేదని, జీవనోపాధి నిమిత్తం ఆవుల పెంపకానికి ఆర్థిక సాయం చేయాలని విన్నవించుకున్నారు సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పదించారు. మిషన్ వాత్సల్య పథకం కింద ఒక్కొక్కరికి ప్రతినెలా 4వేల చొప్పున ఇద్దరు ఆడపిల్లలకు మొత్తం ఎనిమిదివేలు బ్యాంకులో జమ చేస్తామని భరోసా ఇచ్చారు.

ఉంటాయో..ఊడుతాయో?

పింఛన్లపై సర్వత్రా ఆందోళన

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: తాము అధికారంలోకి వస్తే నెలకు నాలుగు వేలకు పింఛను పెంచుతాము..' అంటూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోనే ఎన్నికల హామీ మేరకు నెలకు వెయ్యి రూపాయలు పెంచి అధనంగా మూడు వేలు కలిపి ఏడువేల రూపాయలు పింఛన్ రూపంలో ఇవ్వడంతో సామాజిక పింఛన్ లబ్ధిదార్లు ఆనందించారు. వృద్ధులు, వింతతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు నెలనెలా నాలుగు వేల రూపాలు పింఛను పొందుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చి ఏడాది గడచి పోయింది. అనర్హులున్నారంటూ సామాజిక పింఛన్ల తనిఖీ మొదలు పెట్టాక ఇప్పుడు మొదలైంది సామాజిక పింఛను పొందుతున్న లబ్ధిదార్లతో టెన్షన్.. మొదట్లో వికలాంగ పింఛను సర్వే మొదలెట్టిన ప్రభుత్వం ప్రస్తుతం వృద్ధాప్య, వితంతువుల, వికలాంగుల ఇలా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిదారుల్లో అర్హులు, అనర్హులు తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఓ వైపు సదరం క్యాంపుల ద్వారా వికలాంగ పింఛన్ల ఏరివేత , మరో వైపు వివిధ రకాల పింఛన్ల లబ్ధిదారుల్లో అనర్హులను గుర్తిస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో అనేక మంది అన్యాలుగా పింఛను కోల్పోయే ప్రమాదం వుందని లబ్ధిదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సామాజిక పింఛన్లు వివిధ కారణాలతో తగ్గుతున్నాయి. ఈ మేరకు 2025 జనవరిలో 4,598 పింఛన్లు తగ్గాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు సామాజిక పింఛన్ల సర్వే పేరిట అనర్హులుగా ప్రకటించి భారీగా పింఛన్లకు కోత విధిస్తోందని లబ్ధిదార్లు ఆందోళనకు గురవుతున్నారు.

చిత్తూరు జిల్లాలో మొత్తం వివిధ రకాల ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు 2,65,691 ఉన్నాయి. ఇందులో వృద్ధాప్య1,38, 955, వితంతువులు 60,352, వికలాంగులు 35,072, చేనేత కార్మికులు 2,409, ఒంటరి మహిళలు 5,701, మత్స్యకారులు 241, డప్పు కళాకారులు 6,167, హిజ్రాలు 32, కిడ్నీ, లివర్ బాధితులు 121 ఇలా వివిధ రకాల సామాజిక పింఛను లబ్ధిదార్లు నెలకు 2,65,691 మంది రూ. 113 కోట్లు పొందుతున్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే భారీ పింఛన్ల కోతలు విధించే అవకాశం ఉండటంతో ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చే నాలుగువేల రూపాయల పింఛన్‌పై ఆధారపడ్డ వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -విజయపురం నగరి : జూనియర్ ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ పరిధిలో ఇంటర్ విద్యార్థులకు 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయాన్నే పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకున్నారు. తొలిపరీక్ష కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కేంద్రాల వద్ద బారులు తీరారు. పిల్లలను పరీక్షా కేంద్రానికి పంపి వెను దిరిగారు. అన్ని కేంద్రాల్లోను పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. నాలుగు సెంటర్లలో 1,179 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

పరీక్షా కేంద్రాల వద్ద వేచి చూస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

రేషన్ మా గ్రామానికి దగ్గర ఇప్పించండి..

తహాశీల్దారుకు గువ్వల కాలనీ వాసుల వినతి

ప్రజాశక్తి -పూతలపట్టు: 'అయ్యా మా గ్రామం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న సమనత్తం వెళ్లి ప్రభుత్వ డీలర్ షాపు ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం తీసుకోవాల్సి వస్తోందని తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. ఆటోలో వెళ్లాల్సి వెళ్లి బియ్యం తీసుకువచ్చే ఆర్థిక స్తోమత మాకు లేదు.. గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాం.. మాకు న్యాయం చేసి దగ్గరలోని పూతలపట్టు డీలర్ షాపులో బియ్యం ఇప్పించేందుకు చర్యలు తీసుకోండి..' అంటూ గువ్వల కాలనీకి చెందిన 40 మంది కార్డుదారులు తహాశీల్దారు గుర్రప్పకు టిడిపి మండల నాయకులు గుంటూరు మురళి నాయుడు ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందించారు. స్పందించిన తహాశీల్దారు వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తహాశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: డిఎస్‌పి

ప్రజాశక్తి -విజయపురం(నగరి) : స్టోన్‌క్రషర్, క్వారీ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో స్టోన్‌క్రషర్, క్వారీ యజమానులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్టోన్ క్రషర్, క్వారీ యజమాని మైనింగ్ లీజు ఆర్డర్లు, రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన గని లైసెన్సు, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేటు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. బ్లాస్టింగ్‌కు ఇచ్చిన మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. క్రషింగ్, క్వారీ యూనిట్లలో పనిచేసే కార్మికులు గాయాల పాలు కాకుండా, ప్రాణాపాయం జరగకుండా రక్షణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తనిఖీ నిర్వహించే సమయంలో ఇవేవి లేకున్నా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశంచారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్వారీ యజమానులు, స్టోన్ క్రషర్ యజమానులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్, క్వారీ యజమానులతో చర్చిస్తున్న డిఎస్‌పి సయ్యద్ మహమ్మద్

మా మనవడిని చంపేశారు..!

- మనవరాలినైనా దక్కించండి
- మిన్నంటిన తండ్రి, అవ్వ, తాతల రోదన
- గ్రామస్తులతో రోడ్డెక్కిన కిరణ్ కుటుంబం

ప్రజాశక్తి - కార్వేటినగరం:

'మా మనవడిని చంపేశారు. కనీసం మనవరాలునైనా మాకు దక్కించండి..' అంటూ కొల్లాగుంట దళితవాడకు చెందిన కిరణ్ కుటుంబ సభ్యులు శనివారం రోడ్కెక్కారు. గ్రామస్తుల కథనం మేరకు.. కొల్లాగుంట దళితవాడకు చెందిన కిరణ్ తమిళనాడులోని పల్లిపట్టు గ్రామానికి చెందిన నిషా ఇద్దరూ కలసి గత పది సంవత్సరాల క్రితం కులాంతర వివాహ చేసుకున్నారు. వారికి సుస్మిత(8), మోటు(6) ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే నెల రోజుల క్రితం ఇద్దరి పిల్లలతో కలసి నిషా మేల్మరవతూరు ఆలయానికి వెళ్లి అక్కడి నుంచి ఢిల్లీలో ఉన్న తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పోయింది. దీంతో భార్య కావాలని పెద్దల సాయంతో ఎంత ప్రయత్నించినా ఆమె రాక పోవడంతో పాటు శనివారం కుమారుడు మోటు మృతి చెందినట్లు వీడియోకాల్ ద్వారా తెలపడంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు ' మా మనవడ్ని కావాలని వాళ్లే చంపేశారు.. మనవరాలు తమపై బెంగపెట్టుకుని ముఖం వాచి పోయి అనారోగ్యపాలైన ట్లుంది.. ఉన్నత అధికారులు స్పందించి మా మనవరాలు నైనా మాకు అప్పగించండి...' అంటూ రోదిస్తూ తమ బిడ్డ మృతికి కారకులైన వారిని శిక్షించాలని గ్రామస్తులతో పాటు కొల్లాగుంట దళితవాడ వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై శనివారం రాళ్లు, చెట్ల కొమ్మలు వేసి ధర్నా చేపట్టారు. జిల్లా అధికారులు వచ్చి తమకు న్యాయం చేసేంత వరకు ధర్నాను విమరించ బోమని భీష్మించి కూర్చున్నారు. దీంతో సమాచారం అందుకున్న పోలీలు రంగ ప్రవేశం చేసి న్యాయం జరిగేలా చూస్తామని కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి ధర్నాను విరమింప చేసి రాక పోకలను పునరుద్ధరించారు.

ధర్నా నిర్వహిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

భూసార పరీక్షలు అందని ద్రాక్షే!

- మట్టి సేకరణ మరిచారు
- ఆరోగ్యకార్డుల జారీలో జాప్యం
- అయోమయంలో అన్నదాతలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: రైతులు పంట దిగుబడిలో భూసార పరీక్షలు కీలకమైంది.. దీని ఆధారంగా రైతన్నలు తమ వ్యవసాయ పొలంలో ఏరకమైన పంటలు పండిస్తే...పంట దిగుబడి బాగా వస్తుందో ముందే తెలుసుకుని ఆ రకమైన పంట పండించి అధిక దిగుబడులు పొందాతాడు. అయితే మండలంలోని రైతులకు ఈ భూసార పరీక్షలు అందని ద్రాక్షలా మారింది. ఏ సమయంలో ఏయే పంట పండించాలి? వేస్తే దిగుబడి ఎలా ఉంటుంది? అని చెప్పే అధికారులే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024- 25 సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి మట్టి నమూనా సేకరించి ప్రయోగశాలకు పంపారా? లేక వాటి ఫలితాలు రైతులకు తెలపకుండా తమ సెల్ ఫోన్‌లో డేటా లోనే ఉంచారా? అనే సందేహాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫలితాలు అధికారుల డేటా లోనే ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. తమకు భూసార పరీక్షల ఫలితాలు తెలియకపోవడంతో రైతులు ఏయే పంటలు పండించాలో తెలియక అయోమయంలో పడ్డారు.

భూసార పరీక్షలతోనే అధిక దిగుబడి

మండలంలో ప్రతి రైతుకీ భూసార పరీక్షలు చేసి ఏయే సమయంలో ఏయే పంట వేసుకోవాలో ఈ పరీక్షల ద్వారానే తెలుస్తుంది. మండలంలో ఇంతవరకు సేకరించిన మట్టిని ప్రయోగశాలకు పంపించారా? లేదా అనేది ఎవరికి అంతుపట్టలేదు. అందరికీ తెలిసిన నిజం..వైసిపి ప్రభుత్వ హయాంలో కీలకమైన భూసార పరీక్షలను నాలుగు సంవత్సరాలు చేయలేదు. భూసార పరీక్షలు బాగుంటేనే పంటలు దిగుబడి బాగా వస్తుందని మేధావుల అభిప్రాయం. అందుకే మెట్ట నేలలో ఏయే పంట వేయాలి? బంక నెలలో ఏయే పంటలు పండిస్తే బాగా దిగుబడి వస్తుంది? అని వ్యవసాయ అధికారులకు మాత్రమే తెలుసు.. కానీ రైతుకు తెలియదు. తెలిసినా అధికారులు చెప్పరు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ ఆరోగ్య కార్డులపై దృష్టి సారించింది. జిల్లాలో 502 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల వారీగా ఖరీఫ్ 14,500 , రబీలో 6,400 లెక్కన ఏడాదికి మొత్తం 20,900, మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

వెదురుకుప్పం మండల పరిస్థితి ఇదీ..

మండలంలో మొత్తం 25 పంచాయతీలు ఉన్నాయి. 13 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయ పరమైన సూచనలు, సలహాలు వ్యవసాయ అధికారులు అందించాల్సి వుంది. మండలంలో భూసార పరీక్షలు ఎక్కడా చేయలేదని మండల రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇకనైనా భూ సార పరీక్షలు నిర్వహించి రైతులకు తోడ్పాటు అందించాలని కోరుకుంటున్నారు.

జిల్లా సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రికి సిపిఎం వినతి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా విభజన అనంతరం అభివృద్ధిలో ఇంకా వెనుకబడి పోయింది. పేరుకు చిత్తూరు జిల్లా కేంద్రమైనప్పటికీ జిల్లా కేంద్రంలో ఉన్న పరిశ్రమలు మూత పడిపోతున్నాయి. ఉపాధి కల్పించే పరిశ్రమలు లేవు. విద్య, వైద్య ఉన్నత కళాశాల కూడా లేవు. చదువుకున్న నిరుద్యోగులు బెంగళూరు, చెన్నై ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత కుప్పం నియోజకవర్గానికి అత్యధిక నిధులు కేటాయించి అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారు. ఇది మంచి పరిణామం. ఇదే పద్ధతిలో ఇతర నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు కేటాయించడం వల్ల జిల్లా సమగ్రాభివృద్ధికి తోడ్పాటును అదించాలని జీడి నెల్లూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తూరు జిల్లా సిపిఎం కన్వీనర్ వాడ గంగరాజు శనివారం వినతి పత్రం అందించారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఆధీనంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. నిరుద్యోగులను ఆదుకోవడానికి ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవే , బుల్లెట్ ట్రైన్ రహదారుల ఏర్పాటు సందర్భంగా భూములు నష్టపోతున్న రైతాంగానికి 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. జిల్లాలో అత్యధికంగా ఉన్న మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని, మామిడి పరిశ్రమల్లో నిలువ ఉన్న మామిడి జ్యూస్ ను అన్ని విద్యాసంస్థల్లో సరఫరా చేయడంతో పౌష్టికాహారం పిల్లలకు అందు తుందన్నారు. రైతుల పంటకు యాజమాన్యాలు గిట్టు బాటు ధర కల్పించడంపై ప్రభుత్వం చొరవ తీసుకోవా లన్నారు. అత్యధిక సంఖ్యలో ఉన్న సన్నకారు రైతులను ఆదుకోవాలని, పట్టు రైతులు ప్రోత్సాహక రుణం బకాయి ఉన్న 60 కోట్ల రూపాయలు వెంటనే ఇచ్చి రైతులను ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో అత్యధికంగా ఉన్న పాడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రైవేటు డెయిరీల దోపిడీని అరికట్టాలన్నారు. నగరి నియోజకవర్గంలో వేలాది మంది పవర్‌లూమ్ కార్మికులకు తమిళనాడు తరహాలో 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించి, కూలి రేట్లు పెంచాలని కోరారు. జిల్లాలో గత ప్రభుత్వం హయాంలోనూ, ప్రస్తుతం పేదల భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకొని పేదలకు న్యాయం చేయాలన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలి, ఆశ వర్కర్లు, వివోఏ, మధ్యాహ్న భోజనం ఇతర స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, జిల్లాలో ఉపాధి హామీని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే తాగునీటి సమస్య కనిఎస్తోందని, ఇంకా ఎండలు పెరిగే కొద్దీ సమస్య తీవ్రం అవుతుందని, తాగునీటి కోసం నిధులు ముందే కేటాయించాలని ఆయన కోరారు.

'సూపర్ సిక్స్'కు జబ్బు పట్టింది: మాజీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: సూపర్ సిక్స్‌కు జబ్బు పట్టిందని మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి పేర్కొ న్నారు. శనివారం మండలం లోని పాలేరు గ్రామంలో వైసిపి ఆత్మీయ సమావేశం మండల కన్వీనర్ రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అధికారం చేపట్టేందుకు అబద్ధాల హామీలను చెప్పి అధికారం చేపట్టారని అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు నాయుడు దిట్టని ప్రజలకు సంక్షేమ పథకాలు నమ్మబలికి అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాలు చేపట్టక కుంటి సాకులు చెబుతున్నారని సూపర్ సిక్స్ అని ప్రకటనలు చేసుకుని ప్రతిపక్షంపై కక్ష సాధింపు చర్యలపై పెట్టిన శ్రద్ధ సంక్షేమ పథకాలపై చూపి ప్రజలను ఆదుకోవాలన్నారు. అమ్మకు వందనం, ఫీజు రీయింబర్సు మెంట్, రైతు భరోసా, ఉచిత బస్సు, మహిళలకు ఆర్థిక సహాయం పథకాలను కొనసాగించి చెప్పిన మాట నెరవేర్చు కోవాలని లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి శిరీష్ రెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్, సర్పంచులు భారతి, సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు శంకర్ రెడ్డి, హరిబాబు, కోఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చెత్త సేకరణ కేంద్రానికి మరమ్మతు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

చెత్త సేకరణ కేంద్రాలకు మరమ్మతులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని తీర్థం పంచాయతీ పరిధిలో మరమ్మతుకు గురైన చెత్త సేకరణ కేంద్రాలకు శనివారం మరమ్మతులు చేశారు. ఈ చెత్త నుండి సంపద కేంద్రాలు గతంలో గాలి వర్షాలకు పైకప్పు రేకులు ఎగిరిపోయి శిథిలమయ్యాయి. వాటిని పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు శనివారం మరమ్మతులు నిర్వహించారు. మరమ్మతుల్లో భాగంగా శిథిలమైన పైకప్పు రేకులు విద్యుత్ ఏర్పాటు, సంపద కేంద్రాలకు వాటరు పైపులు అమర్చారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి టిజీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి, ఎలక్ట్రీషియన్ మహమ్మద్ రఫీ, గీన్ ఆమ్బ్యాజర్ష్ పాల్గొన్నారు.

వైభవంగా పార్వతి పరమేశ్వర కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామంలో శ్రీ కామాక్షి సమేత మొగిలేశ్వ ర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడవ రోజు పార్వతి పరమేశ్వర కళ్యాణోత్సవం శనివారం అత్యంత వైభవంగా శాస్త్ర మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ఉభయదారులుగా చిత్తూరు న్యాయవాది సావిత్రమ్మ లోకనాథం రెడ్డి వ్యవహరించారు. ఉదయం భృంగి వాహనంపై ఆదిదేవుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా పాటూరు హిమ బిందు యశ్వంత్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వంశపార ధర్మకర్త విజయకుమార్, ఆలయ కార్య నిర్వహణ అధికారి మునిరాజులు, అర్చకులు రెడ్డప్ప గురుకుల్, హరికెష్ గురుకుల్, సోము గురుకల్, పవన్ గురుకుల్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

భృంగి వాహనంపై ఊరేగుతున్న శివుడు

కనక దుర్గమ్మ దేవాలయ కుంభాభిషేకం

కాణిపాక ఆలయం నుండి సారె సమర్పణ

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు శ్రీ కనకదుర్గ ఆలయ కుంభాభి షేకం శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా కాణిపాక దేవస్థానం నుండి అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదాలు మొదలైనవి సారె రూపంలో కానుకగా సమర్పించారు. కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్ర బాబు చేతుల మీదుగా కనకదుర్గాదేవికి చీర, పట్టు వస్త్రాలు, గాజులు, పసుపు కుంకుమ అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు తిరుమలయ్య , ఎంటివి స్వామి, డి త్యాగరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాణిపాకం దేవస్థానం ఏవో, ఏఈఓ అందించిన గౌరవ కానుకలకు పలమనేరు కనకదుర్గమ్మ దేవస్థానం కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పట్టు వస్త్రాలు అందిస్తున్న కాణిపాకం ఆలయాధికారులు

ఎంపీకి సీఎం ప్రశంస

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావును ప్రశంసించారు. ఆయన స్ఫూర్తితో పనిచేయాలని టిడిపి శ్రేణులకు సీఎం పిలుపు నిచ్చారు. శనివారం గంగాధర నెల్లూరులో నిర్వహించిన ప్రజా వేదికలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు ఉన్నతమైన ఉద్యోగంలో ఉంటూ నిష్పక్షపాతంగా ప్రజా సేవ చేయాలన్న సంకల్పంతో ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తపన ఆయనలో ఉందని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న పట్టుదల కలిగిన వ్యక్తి చిత్తూరు ఎంపీ అని సీఎం చంద్రబాబు అభినందించారు. ఆయన అందిస్తున్న సేవలను జీడి నెల్లూరు నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని , ఇదే స్ఫూర్తితో మిగిలిన వారు కూడా పనిచేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు.

విజ్ఞానం సమాజ అభివృద్ధికి అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్ : భారతీయజ్ఞాన పరంపర విజ్ఞానం ఆధునిక సమాజ పురోగాభివృద్ధికి అత్యావశ్యమని, జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీ, విశ్వవిద్యాలయ స్థాయిలలో పనిచేసే అధ్యాపకులకు భారతీయ పురాతన ప్రాచీన గ్రంథ సంపద, ఇతర అంశాలపై శిక్షణ ఎంతో అవసరమని యుజిసి జాయింట్ సెక్రటరీ డా.అనోల్ అంధరె పేర్కొన్నారు. ఎస్వీయూలోని మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో యుజిసి సహకారంతో "భారతీయ జ్ఞాన పరంపర" అనే అంశంపై వారం రోజులు పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం ముగింపు సభ శనివారం సైన్స్ కళాశాల సమావేశపు మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎమ్టిటిసి డైరెక్టర్ ఆచార్య ఆర్పి. విజయలక్ష్మి, ఆచార్యులు, డాక్టర్ జయచంద్ర రెడ్డి, డాక్టర్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ సుదర్శన రెడ్డి, డాక్టర్ ఫణీంద్ర రెడ్డి, డాక్టర్ కుమార్, డాక్టర్ బుల్లీ దాస్, డాక్టర్ చందులాల్, డాక్టర్ వివేక్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ పల్లవి, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని రంగాల అభివృద్ధికి నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెరువు మట్టి తరలింపు

- అధికారుల అండ - ఇదీ కడపనత్తం చెరువు పరిస్థితి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనాత్తం పెద్ద చెరువులో మట్టి యథేచ్ఛగా తరలిపోతోంది. అధికారుల అండతోనే వారు యథేచ్ఛగా తరలిస్తున్నారని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు. శనివారం మూడు జెసిపిలు, ఏడు ట్రాక్టర్లలో చెరువు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికుల కథనం మేరకు రోజుకు 50కి పైన ఇసుకలోడ్లు తరలిస్తున్నారని చెరువులో ఇలాగే మట్టి వ్యవహారం కొనసాగితే పరిసరాల్లోని వ్యవసాయ బోర్లులో నీటిమట్టం తగ్గిపోయి వ్యవసాయం కుంటుపడే ప్రమాదం వుందని స్థానికులు వాపోతున్నారు. కానీ అధికార పార్టీ , రెవెన్యూ సిబ్బంది అండదండలతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా కలెక్టర్ స్పందించి చెరువులో అక్రమంగా తరలిస్తున్న మట్టిని అరికట్టి రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోరు మోటర్లు మట్టి తవ్వకంతో నీరు భూమిలో నీటి మట్టం తగ్గి బోర్లు ఎండిపోయే ప్రమాదం వుందని, వెంటనే అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తహశీల్దారు వివరణ

కడనపనత్తం చెరువులో మట్టి తీసుకెళ్లడానికి ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. మాపై ఎవరో చేస్తున్నవి ఆరోపణలు మాత్రమే.. ఇందులో నిజం లేదు.. మా అనుమతి లేకుండా ఎవరూ మట్టి తీసుకెళ్లడానికి వీలు లేదు. వెంటనే మా సిబ్బందిని పంపి చెరువులో మట్టి తరలిపోకుండా చర్యలు తీసుకుంటాం..

- మాధవరాజు, తహశీల్దారు, బైరెడ్డిపల్లి.

మట్టిని తరలించేందుకు వేచి ఉన్న ట్రాక్టర్లు, జెసిపిలు

రథోత్సవానికి ఉచిత బస్సులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఈశ్వర కళ్యాణ్ అభయ ఫౌండేషన్ పలమనేరు నుండి బంగారు పాళ్యం వరకు ఉచితంగా బస్సులు నడపనున్నట్లు ఈశ్వర కళ్యాణ్ అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శనివారం తెలిపారు. భక్తులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలన్నారు.

ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

వైసిపి కార్యకర్తల కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా

గౌరీకి పరామర్శ

ప్రజాశక్తి- నింద్ర: నింద్ర మండలం చేరంబాకం గ్రామంలో మాజీ సర్పంచ్ సత్యరాజు సోదరి గౌరీ కుమార్తె 7 సంవత్సరాల పాప అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి ఆర్‌కె రోజా శనివారం ఆ గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి గౌరీ దంపతులను పరామర్శించి సానుభూతి తెలిపి ధైర్యంగా వుండాలని మీ కుటుంబానికి వైసిపి ఎప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఎలకాటూరు వైసిపి సీనియర్ నాయకులు నామ దేవరెడ్డి ఇంటికి వెళ్లారు. ఆయన భార్య అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లిన సమాచారం తెలుసుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బ్రాందీ షాపు పెట్టొద్దు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి రూరల్ మండలం, సాయి నగర్ గ్రామపంచాయతీ రెసిడెన్షియల్ ఏరియాలో బ్రాది షాపు ఏర్పాటును నిలిపివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. తిరుపతి శ్రీ పద్మావతి బైరాగి పట్టెడ రోడ్డు నుండి అవిలాలకు పోయే దారిలో రెసిడెన్షియల్ ఏరియాలో బ్రాందీ షాప్ పెట్టరాదని సాయి నగర్ నివాసులు, హాస్టల్ విద్యార్థులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ నగర కార్యదర్శి విశ్వనాథ్ జిల్లా సమితి సభ్యులు ఎన్ శ్రీరాములు వైయస్ మణి ఎఐటియుసి నగర నాయకులు అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అఘోరి హల్ చల్

గోవులను తరలిస్తున్న లారీలను అడ్డుకున్న వైనం
రంజాన్ మాసం సందర్భంగా గోవులను అక్రమంగా తరలిస్తున్నారని గొడవ

ప్రజాశక్తి - చిల్లకూరు : ఈ మధ్య కాలంలో ఇటు తెలంగాణ, ఆంధ్రాలోని అనేక ప్రాంతాలు, దేవాలయాల్లో తిరుగుతూ కొన్ని చోట్ల వివాదాస్పదంగా వ్యవహరించిన మహిళా అఘోరి తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం బూదనం టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై గోవులను తరలిస్తున్న మూడు లారీలను ఆపి ఎటువంటి అనుమతి పత్రాలతో గోవులను తరలిస్తున్నారంటూ హల్ చేసింది. రంజాన్ మాసం సందర్భంగా గోవులను వధించేందుకే తీసుకెళ్తున్నారు అంటూ లారీలను ఆపింది. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇదే సమయంలో గో వధపై నిషేధం, అక్రమ రవాణాపై నిఘా ఉంచవలసిన పోలీసులు అధికారుల వ్యవహార తీరుతో అక్రమంగా ప్రతిరోజు పదుల సంఖ్యలో గోవులు లారీల్లో రవాణా అవుతున్నాయి. దీనిపై ధార్మిక సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. కొందరు అఘోరిని లారీలను ఎందుకు ఆపావు అని ప్రశ్నించడంతో సనాతన ధర్మంలో భాగంగానే తాను గో అక్రమ రవాణాను అడ్డుకున్నానని, సరైన పత్రాలు లేకుండా వందల సంఖ్యలో గోవులను వధించేందుకు తీసుకెళుతున్నారని పోలీసులు లారీలను స్వాధీనం చేసుకుని అక్రమార్కులపై కేసు నమోదు చేయాలని కోరారు. ఆమెకు కొందరు హిందువులు మద్దతుగా గోవులను అక్రమ రవాణా చేస్తున్న లారీలను వీడియోలు తీశారు.

విద్యుత్ అదనపు లోడు
క్రమబద్ధీకరణకు రాయితీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో గృహ విద్యుత్ ఆదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు తాము వినియోగిస్తున్న అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు ఈ యేడాది మార్చి 1వతేదీ నుంచి జూన్ 30వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

లిఫ్ట్ ఆపరేటర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి : విష్ణు నివాసంలో పనిచేస్తున్న రాజశేఖర్, శ్రీనివాసులు, హరీష్, అనిల్ కుమార్‌లు లిఫ్ట్ ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. వీరందరూ విభిన్న ప్రతిభావంతులు. వీరు సక్రమంగా పని చేయలేరని మార్చి ఒకటో తేదీన పనోరమ కంపెనీ తొలగించిందన్నారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నాయకులు టి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు.

వేతన జీవులను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్ : సిఐటియు

ప్రజాశక్తి-పలమనేరు: బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారంటే వేతనాలు పెరుగుతాయని ఎదురుచూసే వేతన జీవుల ఆశలను రాష్ట్ర ప్రభుత్వం అడియాసలు చేసిందని సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ప్రసంగంలో కొన్ని పథకాల అమలు కోసం కేటాయింపులు చేస్తామన్నారు తప్ప జీతాల కోసం పనిచేస్తున్న కార్మికులకు బడ్జెట్‌లో చోటివ్వ లేదన్నారు. ఎటువంటి జీఓ ఇవ్వకుండానే మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం చూస్తే గడ్డి చూపించి గుర్రాన్ని పరిగెత్తిం చడం వంటిదే అని విమర్శించారు. ఆశా వర్కర్ల జీతాల పెంపు ప్రస్తావన లేదని, ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు హామీ మరిచారన్నారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామన్న హామీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన విధంగా ప్రభుత్వం దొడ్డి దారిన వాడేసుకున్న బిల్డింగ్ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ఈ బడ్జెట్‌లో జమ చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమకు మినిమం టైంస్కేల్, ఉద్యోగాల పర్మినెంట్ అవుతాయని పెట్టుకున్న ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్ల చల్లిందన్నారు. పీఆర్‌సీ, ఐఆర్ ఊసేలేదు. వారికి చెల్లించాల్సిన రూ. వేలాది కోట్లు బకాయిల ప్రస్తావన, కేటాయింపుల్లేవని, ఓపీఎస్ పునరుద్ధరణ ప్రస్తావన లేదన్నారు. లక్షలాది మంది పనిచేస్తున్న సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ తదితర ప్రభుత్వ పథకాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌కు, రెండు లక్షల మంది ఔట్‌సోర్సింగ్‌కు, మినిమం టైంస్కేల్ అమలు; మధ్యాహ్న భోజన పథకం, వెలుగు కార్మికులకు కనీస వేతనాల అమలు, విద్యుత్, ఆర్టీసీ తదితర ప్రభుత్వరంగ సంస్థల కాంట్రాక్ట్ కార్మికులకు డైరెక్ట్ పేమెంట్, టైం స్కేల్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ గురించి కనీసం ప్రస్తావన, కేటాయింపులు లేవని పేర్కొన్నారు. తక్కువ జీతాలు తీసుకునే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు సంక్షేమ పథకాల హామీ ప్రస్తావనే బడ్జెట్‌లో లేకపోవడం శోచనీయం అన్నారు. కార్మికుల వేతనాల కోసం, సంక్షేమం కోసం తగిన విధంగా బడ్జెట్ ప్రతిపాదనల్లో తగిన మార్పులు చేయాలని గిరిధర్ గుప్తా డిమాండు చేశారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-తవణంపల్లి: గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో అపోలో గ్రూప్ ఛైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి ఏర్పాటు చేసిన అక్షయ ధార పథకంలో భాగంగా మండలంలోని గల్లా వారి ఊరు, ఎగుతడకర పంచాయతీ వెంకటాపురం గ్రామాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ గురుకు వారిపల్లి నరోత్తం రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరోత్తం రెడ్డి మాట్లాడుతూ అపోలో గ్రూప్ ఛైర్మన్ తన సొంత మండలానికి మంచి చేయాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా అరగొండ అపోలో సంపూర్ణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా మండలంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలకి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో అపోలో గ్రూప్ ఆధ్వర్యంలో మండ లంలో దాదాపు 20 గ్రామా లలో మిన రల్ వాటర్ ప్లాంట్ల ను ఏర్పాటు చేశామ ని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి అపోలో గ్రూప్స్ డైరెక్టర్ ఉపాసన ఎంతో ముందుండి తమను ప్రోత్సహిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పిటిసి భారతి, మధు కుమార్, ఎంపిటీసీ ఇంద్రాణి , గంగయ్య, నాయకులు గాంధీ, బాబు, జొన్న గురకల రాజశేఖర్ రెడ్డి, టి పుత్తూరు పాలాక్షి రెడ్డి, భూపతి నాయుడు, టోటల్ హెల్త్ సిసిఓ రాంబాబు, అపోలో ఫార్మసీ డిజిఎం సత్యరెడ్డి, అపోలో హాస్పిటల్స్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌ను అందిస్తున్న దృశ్యం

సకాలంలో ప్రజా సమస్యలు పరిష్కరించండి

అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రతి శనివారం నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులను, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం చిత్తూరు లక్ష్మీ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజా దర్బార్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో అందే ప్రతి వినతి, ఫిర్యాదుపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలన్నారు. వచ్చిన సమస్యలు మళ్లీ రాకుండా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. శనివారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో మొత్తం 25 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, తహశీల్దారు జయంతి, ఎంపీడీవో శివరాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

సామాజిక పింఛన్లతో ఆర్థిక భరోసా: ఎంపీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు అవ్వ తాతలకు ఆర్థిక భరోసానిస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన కూటమి ప్రభుత్వం ప్రతినెల ఒకటో తేదీనే అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు అందిస్తోందని వారు తెలిపారు. ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రతినెలా నిర్వహించే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని శనివారం చిత్తూరులోని ఎనిమిదో డివిజన్లో యథావిధిగా కొనసాగించారు. ఇందులో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నగర మేయర్ కుమారి అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్మన్ కఠారి హేమలత హాజరై లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆ ప్రాంత ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. అంతే కాకుండా 8 డివిజన్లలో అభివృద్ధి పనులను ఎంపీ, ఎమ్మెల్యేలు పరిశీలించారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్థానిక ప్రజల్లో భరోసా నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో జీతాలు కూడా సమయానికి ఇవ్వలేని పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా ఒకటో తేదీనే సాలరీస్తో పాటు పించన్లు అందిస్తూ.. సమర్థవంతమైన పాలనకు నిర్వచనం చెప్పిందని తెలిపారు. రియల్ గవర్నెసికి మారుపేరుగా నిలిచిందని కొనియాడారు. అందుకే ఇది మంచి ప్రభుత్వం అన్న మాట నిలబెట్టుకుని ప్రజల వద్ద మన్న నలు అందుకుంటోందన్నారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్, ఇతర అధి కారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

క్రైం న్యూస్

ప్రమాదంలో మృతి చెందిన తులసమ్మ, రవితేజ

లారీ, ద్విచక్ర వాహనం ఢీ

- ఇద్దరు మృతి - ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -శాంతిపురం: మండల పరిధిలోని మఠం గ్రామం వద్ద శనివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు , రాలబుదుగురు పోలీసుల కథనం మేరకు..బైరెడ్డిపల్లి మండలం మూగనపల్లి గ్రామానికి చెందిన మునిరాజు భార్య తులసమ్మ(45) వారి కుమారులు రవితేజ(19), పవన్(21)తో కలిసి తమ ద్విచక్ర వాహనంపై శాంతిపురం మండలం సోగడబళ్ళ, వెంకటే పల్లి గ్రామాల మధ్య ఉన్న శ్రీ ఎల్లమాంబ అమ్మవారి వార్షికోత్సవాలకు బయలుదేరారు. మార్గమధ్యంలో మట్టం గ్రామం వద్ద కుప్పం -పలమనేరు రోడ్డుపై కుప్పం వైపు నుండి ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో తొలిసమ్మ, రవితేజ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన పవన్‌ను 108 సాయంతో పిఎస్ ఆస్పత్రికి తరలించారు. రాళ్లబుదుగురు పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాలను కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : కుప్పం మండలం చందం పంచాయతీ హరిజనవాడలో సిసి రోడ్డు నిర్మాణానికి స్థానిక మహిళ కార్యకర్త శనివారం శంకుస్థాపన పూజా కార్యక్రమం నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం కుప్పం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికే పలుచోట్ల అభివృద్ధి కార్యక్రమాలు మొదలయ్యాయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

టీక్యూఆర్ఎల్ ఎందుకు పూర్తి చేయలేదు?

ఉపాధ్యాయులపై ఎంఈవో ఆగ్రహం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : 'టీచింగ్ అట్ రైట్ లెవల్ (టీక్యూఆర్ఎల్) ఎందుకు పూర్తి చేయలేదు?' అని ఉపాధ్యాయులపై ఎంఈవో శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని అగరం, మీరాసాహెబ్ పాళెం గ్రామాల్లోని పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. మీరాసాహెబ్ పాళెంలో 1,2 తరగతులకు గణితం సిలబస్ పూర్తి చేయకపోవడం, 4,5 తరగతులకు ఆంగ్లబోధన సక్రమంగా నిర్వహించక పోవడంపై ఉపాధ్యాయులను మందలించారు. అగరం పాఠశాలలో టీక్యూర్ఎల్ సక్రమంగా ఉండటంతో ఉపాధ్యాయులను ప్రశంసించారు.

IN THE COURT OF THE IInd Addl DIST JUDGE OF MADANAPALLE

A.S.No 81/2023

V. Muragaiaha Naidu & others. ...Appellants

Vs

G. Janardan Naidu & others. ...Respondents

NOTICE TO RESPONDENT NO.6

To,
Rajani, Vinayakparam, Petamitta, Thalapulapalle (Post), Puthalapattu (Mandal)

Please take notice that the above Appellants filed the above As against the decree and judgement passed in S.O.P.NO 48/2017 on the file of the senior civil judge of MPL and notice is ordered to you in the above Appeal, and the Appeal is posted to 11-3-25 for your appearance either in person Through an Advocate by 10-30 A.M, and if you fails to appear the matter will be decided Expartly.

//By Order of the Court//

SURABHI RAMA GOPAL RAO
Advocate/Notary/Receiver
MADANAPALLE.

PUBLIC NOTICE

The General Public is hereby informed that as per instructions of my clientK VENKATESH S/O K.KRISHNAIAH Resident of H.NO.6-32, Chokkamadugu village, Muddikuppam Grama panchayat, S.R.Puram Mandal, Chittoor District approached my Client's Bank I.e., IndusInd Bank ltd., Tirupati branch with a request to advance of Housing Loan By mortgaging his property described below:

Description and location of the property

Property Situated at Chittoor District -Chittoor Registration District Karvetinagaram Sub-district -S.R.Puram mandal -Muddikuppam Grama Panchayat - Chokkamadugu Village accounts - Gramakantam -Sy.No.97/2A - L.P.No.161, in which site bounded on **East:** House of Ashok, **West:** Site belongs to N Kumar, **North:** Site Belongs to P Pichaiah, **South:** Cement Road and House of K Gopi With in these Boundaries East to west - 60 ft or 18.288 mts, North to south - 40 ft or 12.192 mts, Total 2400 sq ft or 266.66 sq yards of site in which RCC house bearing D.No.6-32. That on behalf of My client I caution the General public, if any person/ Institution, is having any objections, claims, interest for the above property, intended person may contact the undersigned with relevant documentary proof substantiating his/her/their objections, claims and disputes etc., within (5) days from the date this notice, failing which my client will proceed with transaction by accepting the above said property as security, as if there are no third party claims or objections in respect of above said property and thereafter no claims or objections will be entertained.

KATARI MAHESH, M.A.,LL.M.,
ADVOCATE
D.NO.19-12-351,BAIRAGIPETTADA,
TIRUPATI, Cell:9652405240